అట్టులలపోక జలకంబు లాడియాడి
గట్టునకు జేరిపుట్టంబు గట్టికొనగ
అతివగనప్పట్టెఁ గ్రొంబొగలావరింప
నడుమ వెలుగొందు హోమాగ్ని నాల్కపోలె.

చికురముల వ్రేళ్ళ ద్రువ్వుచుఁ జిక్కడల్చి
మెల్లదడియార్చుకొంచు ప్రఫుల్లవదన
గాలికెదురేగ రాహువు కబళనేచ్ఛ
చంద్రబింబంబు వెన్నాడు సరణిదోచు.

అఱగొఱచీర యంసముల నందియునందని పైఁటచెంగె యా
తరుణికి లోకమిచ్చినయుదారపు నాగరికంబు; శేష సుం
దరత సమస్తముం బ్రకృతి దానె యొసంగెను; నాగరాంగనా
పరిచితమైనలజ్జ యోఁజువంటిదొకన్నె యెఱుంగదింతకుఁ.

కరమునదోటికత్తి, మొలకట్టునఁ బిల్లనగ్రోవి, క్రొమ్ముడిఁ
విరిపొరలందగింప నడవింజను దెంచుచు నొక్కచోట ము
మ్మరముగ ఝుంకరింప మధుమక్షికముల్, తలయెత్తిచుట్టు ప
ట్లరయుచునుండెఁ దేనె పెరయాకుల దాఁగెనటంచు
నెంచుచుఁ.

అనిన విని లతాంగి యనెనాదుస్మృతి పథ
మంటియుండు శైశవానుభూతి ;
దానిఁ జింత సేయఁ దనరుఁ గన్నులఁ గట్టి
నట్లు బాల్యచర్యలన్ని యిపుడు.

గిరిఁదీరంబులనల్లి, ఘుంఘుమరవాకీర్ణ ప్రవచ్ఛారు ని
ర్ఝరిణీ శీకరపోషితంబులయి యశ్రాంతంబు సౌరభ్య బం
ధురతంజిల్కు లతావితానములఁ బ్రత్యూషంబునం జేరి సుం
దర వర్ణాంకిత పక్షముల్ గలుగు సీతాశోకముల్ పట్టుదుర్.

స్వచ్ఛముగఁబాఱు సెలయేటి జలమునందు
ఆకుపక్కెలు త్రుళ్ళింత లాడుచుండఁ
గలువపుప్పొడి నెత్తావిఁగ్రమ్ముచుండ
మునుగుచుంటిని ; జేపలఁ బుణుకుచుంటి.

గొఱ్ఱెపిల్లల నమ్మలఁ గూడఁ గదిపి
పాలుత్రావించి యావలఁ బట్టుపఱతు ;
ఎన్నిముద్దులు పెట్టిన నేమి యనవు ;
అట్టి కొదములె పసినాఁటి యాటచెలులు.

పొలతీ, చింతలనేల, వేగగొఱలం బోఁదోలు, మంభోదముల్
బలమయ్యెన్ దిశలందుఁ మార్గము, తరుల్ పల్లంబులున్
మిట్టలుం
దెలియన్ రావిట; శీతలానిలహతిన్ దేహమ్ముమ్రానయ్యె; భూ
స్థలి జాగ్రత్తగ మెట్టు మీ, జనకునిన్ దర్శింత మిచ్చోటనే.

అతఁడిటులఁ బల్కు నతివయుఁ జిత్తమ్ము
లేని కీలుబొమ్మలీల, గొఱలఁ
దోలికొంచుఁ జనియెఁ దోడురా యువకుండు
ఖడ్గపాణియగుచుఁ గడిమి మెఱయ.

జనకునిగాంచఁ జిత్తజల జాతముశోషిలి కాంతయున్ ఘనా
ఘన పతితాంబు బిందులటుఁ గాదరశాశ్రులు కంఠసీమకుం
దొనకఁగ నేడ్వఁదండ్రియును దొరపుటుమ్మలికంబుమ్రింగి యి
ట్లనియెను గద్గదస్వరముల స్ఫుటమై కరుణార్ద్రమై తగన్.

అమ్మా, ముద్దులగుమ్మ, యేల మలసంధ్యారాగముల్ వాయమే
ఘుమ్మల్ గ్రమ్మిగ నొంటినుంటివి, జడింగంపమ్ము వాటిల్లదే?
నెమ్మేన్ గగ్గురు నొందదే చలికిఁ; జన్నై యిట్లు వర్షమ్ము నం
జెమ్మల్ వ్రాలిన బాటలన్ నడువఁ; గొంచెమ్మైన భీతిల్లవే?

అంత వనకుమారి యనియెనిట్టుల నయ్య
యిదియె మా కుటీర మిందుఁ జొరుము.
దొడ్డిబెట్టి గొఱ్ఱె తుటములనేవత్తు
ననిన నట్లకాక యనియె నతఁడు.

ఆలయంబుఁ జొచ్చి యజినం బఱంగు పైఁ
బఱచి యుంటఁగాంచి బాగుపఱచి
వృద్ధునల్లదింపి వేదిపై శయనింపఁ
బెట్టి, యంత నాత డిట్టులనియె.

గొఱియల దొడ్డిఁదోలి యిటకుఁ సుమకోమల వచ్చునంతకుం
ద్వరితగతిఁ రచింపవలెబంధము, నట్టులొనర్పకున్న న
త్తరుణియుఁ గ్రొత్తనెత్తురులు ధారలుగా స్రయింపగాంచియు
ద్ధుర హృదయాకులత్వమున దుఃఖ పయోధిని మున్గిపోవదే.

అని యీరీతి వచించు నయ్యువకునయ్యా, యేలబంధంబు, పో
యెను గీలాలము రక్తనాళముల, నింకేలీల నా ప్రాణముల్
మనునిమ్మేన, వృథాప్రయాసపడఁగఁ లాభంబె? నిస్సత్వభా
జనమయ్యెఁ సకలాంగకంబులును; వాచాశక్తి జీర్ణించెడిఁ.

